ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

గురువారం 1 ఆగస్టు 2024

వయనాడ్ చేరుకున్న రాష్ట్ర సహాయక బృందం

- కేరళ ప్రభుత్వానికి రూ.5 కోట్లు అందజేసిన మంత్రి ఏవీ వేలు
- ఊటీకి చేరిన రాష్ట్ర వాసుల మృతదేహాలు



కేరళ సీఎంకు ఆర్థిక సాయానికి సంబంధించిన వివరాలు అందిస్తున్న రాష్ట్ర మంత్రి ఏవీ వేలు



అడయార్, జూలై 31: పొరుగు రాష్ట్రమైన కేరళలోని వయనాడ్‌లో వరద బాధితుల సహాయం కోసం రాష్ట్రం నుంచి 50 మందితో కూడిన బృందం వెళ్లింది. మరబోట్లు, వరద బాధితుల్ని రక్షించేందుకు అవసరమైన సామగ్రి, చెట్లను తొలగించేందుకు అవసరమైన యంత్రాలతో పోలీసు, అగ్నిమాపక బృందాలు వయనాడ్ చేరుకున్నాయి వీరంతా బుధవారమే సహాయక చర్యలకు ఉపక్రమించారు. స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి వారు సహాయ చర్యలు చేపడుతున్నారు. మరోవైపు వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.5 కోట్ల చెక్‌ను బుధవారం రాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రి ఏవీ వేలు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలిసి అందజేశారు. అంతేగాక వయనాడ్ ప్రజలను ఆదుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా వుందని సీఎం స్టాలిన్ తరపున భరోసా ఇచ్చారు. దీనికి పినరయి విజయన్ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రానికి చేరిన మృతదేహాలు: వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో నీలగిరి జిల్లా గూడలూరు ప్రాంతానికి చెందిన కార్మికుడితో పాటు ఓ పూజారి కూడా మృతి చెందారు.వీరి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు సంబంధిత అధికారులు అప్పగించారు. జిల్లాలోని ఆట్టికుళి ప్రాంతానికి చెందిన కాళిదాస్ (32) అనే కార్మికుడు, అమ్మన్ కవికి చెందిన కళ్యాణ్ కుమార్ (53) అనే పూజారి ఈ శిథిలాల కింద చిక్కుకుని మరణించారు. వారి మృతదేహాలను రెస్క్యూ బృందాలు వెలికి తీయగా, మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వయనాడ్ మృతుడి కుటుంబానికి సీఎం ఆర్థిక సాయం: కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి మరణించిన రాష్ట్రానికి చెందిన కళ్యాణ్ కుమార్ కుటుంబానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మూడు లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. అలాగే, తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఇదే విషయంపై బుధవారం ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడటంతో నీలగిరి జిల్లా పందలూరు డివిజన్, సేరంగోడు గ్రామం కొల్లి అట్టి అంబేద్కర్ నగర్‌కు చెందిన కళ్యాణ్ కుమార్ (52) అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయారనే విషయం తనను తీవ్ర వేదనకు గురిచేసిందని సీఎం పేర్కొన్నారు. ఈ విపత్తులో కుటుంబ సభ్యుడిని కోల్పోయి దుఃఖసాగరంలో ఉన్న మృతుని కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలుపుతున్నట్టు తెలిపారు. అలాగే, సీఎం సహాయ నిధి నుంచి మృతుని కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేయాల్సిందిగా ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు.



వయనాడ్ మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కీల్పాక్‌లోని రజీనా మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూలులో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు జరుపుతున్న విద్యార్థినులు

విద్యకు పేద, గొప్ప అడ్డుకారాదు

9న విద్యార్థులకు రూ.1000 పథకం ● సీఎం స్టాలిన్ ● వివిధ కార్యక్రమాల్లో సహాయాల పంపిణీ



సీఎంతో లబ్ధిదారులు, విద్యార్థినులు

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా విద్యనభ్యసించేందుకు కులమత ఆర్థిక అంశాలు ఏమాత్రం అడ్డుకారాదని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. విద్యార్థులకు మనం ఇచ్చే ఆస్తి, ఎన్నటికీ నశింపజేయలేనిది ఒక్క విద్య మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. తన సొంత నియోజకవర్గం కొళత్తూరులో బుధవారం జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన లబ్ధిదారులకు సహాయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ విద్యార్థులకు కూడా రూ.1000 చొప్పున ఆర్థిక సాయం చేసే పథకాన్ని ఆగస్టు 9వ తేదీ నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల విద్యను పూర్తి చేసి కాలేజీల్లో చేరే విద్యార్థినులకు పుదుమైపెణ్ పథకం కింద 2.73 వేల మందికి ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా ఎవర్విన్ పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన కపాలీశ్వర కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు, ఆ తర్వాత పెరియార్ నగరంలో అనిత అఛీవర్స్ అకాడమీలో జరిగిన మరో కార్యక్రమంలో పాల్గొని సహాయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నప్పటికీ కొళత్తూరు నియోజకవర్గంలో అడుగుపెడితే మాత్రం ఎక్కడ లేని ఉత్సాహం వస్తుందన్నారు. అందుకే ఎంత బిజీగా ఉన్నప్పటికీ పదిరోజులకో లేదా వారానికో ఒకసారి అయినా ఇక్కడ పర్యటించేందుకు ఆసక్తి చూపిస్తానని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ సెగ్మెంట్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేలా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఒక్క స్థానమే కాదని రాష్ట్రంలోని 234 నియోజకవర్గాలు తనవేనన్నారు. కొళత్తూరులో కొత్తగా తహసీల్దారు కార్యాలయం, పోలీస్ కమిషనరేట్, పోలీస్ స్టేషన్, అగ్నిమాపక కేంద్రం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పలు కార్యాలయాలను నిర్మించనున్నట్టు తెలిపారు. ఇదే విధంగా ప్రతి నియోజకవర్గంలోనూ నిర్మాణాలు చేపడతామన్నారు. తాము అధికారంలోకి వచ్చినపుడు రాష్ట్ర ప్రజానీకానికి ఒక మాట చెప్పామన్నారు. తమ పాలన చూసి ఎన్నికల్లో ఓట్లు వేసిన ప్రతి ఒక్కరూ ఎంతో సంతోషంగా ఉండాలని, ఓట్లు వేయని వారు ఎందుకు ఓట్లు వేయలేదని చింతించేలా ఉంటుందని చెప్పామని, అదేవిధంగా తమ ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు.

రూ.5 వేల కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనం

రాష్ట్రంలో ఆక్రమణలకు గురైన దేవాదాయ శాఖకు చెందిన రూ.5 వేల కోట్ల విలువ చేసే ఆస్తులను తమ ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. ఇప్పటివరకు 14001 ఆలయాకు కుంభాభిషేకాలు నిర్వహించామన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కొత్తగా డిగ్రీ కళాశాలలను స్థాపిస్తున్నామని, అలాంటిదే కపాలీశ్వర ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ అని తెలిపారు. ఇది ఇపుడు ఒక కళాశాలగానే కాకుండా నాలెడ్జ్ హబ్‌గా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో 740 మంది విద్యార్థులకు వివిధ రకాల విద్యా ఉపకరణాలను అందజేశామన్నారు. కేవలం ఈ ఒక్క కాలేజీ విద్యార్థులకే కాకుండా 2021వ సంవత్సరం నుంచి 1405 మంది విద్యార్థులకు పలు రకాల సాయాలు చేసినట్టు తెలిపారు. అదేసమయంలో విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం స్టాలిన్ కోరారు. కాగా, ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొన్ముడి, పీకే శేఖర్ బాబు, నగర మేయర్ ఆర్.ప్రియ, ఉత్తర చెన్నై ఎంపీ కళానిధి వీరాస్వామి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేనేమీ రాష్ట్రపతిని కాదు..

రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి పదవీకాలాన్ని మరోమారు కేంద్ర ప్రభుత్వం పొడిగించనుందనే వార్తలు వస్తున్నాయని మీడియా ప్రతినిధులు సీఎం వద్ద ప్రస్తావించగా.. తాను ప్రధానమంత్రినో లేదా రాష్ట్రపతినో కాదని వ్యాఖ్యానించారు.

గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమైన

పుదువై బడ్జెట్ సమావేశాలు

● డీఎంకే, కాంగ్రెస్ ఎమ్మెల్యేల వాకౌట్



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

పుదుచ్చేరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర 15వ అసెంబ్లీ 5వ బడ్జెట్ సమావేశాలు ఇన్‌చార్జ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రసంగంతో బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే డీఎంకే నేత, ప్రతిపక్ష నాయకుడు శివ నేతృత్వంలో డీఎంకే, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభలో లేచి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర బడ్జెట్‌లో పుదుచ్చేరికి నిధులు కేటాయించలేదని ఆరోపిస్తూ.. వారంతా అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. కాగా, గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ తన ప్రసంగంలో... 18వ లోక్‌సభకు ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని, దీనికి సహకరించిన రాజకీయ పార్టీలకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వ శాఖల్లో 1,119 ఖాళీ పోస్టులను ప్రభుత్వం భర్తీచేసిందని తెలిపారు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధుల నుంచి 93.87 శాతం ఖర్చయ్యాయని, ఇది గత ఏడాది కంటే 6.55 శాతం అధికమని, పుదుచ్చేరిలో సగటు మనిషి ఆదాయం రూ.2.63 లక్షలకు పెరిగిందన్నారు. గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలోనే మళ్లీ సభలోకి వచ్చిన డీఎంకే, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గత బడ్జెట్ సమయంలో తయారుచేసిన ప్రసంగాన్నే గవర్నర్ మళ్లీ చదువుతున్నారని అభ్యంతరం తెలిపారు. గత బడ్జెట్‌లో ప్రసంగించిన పథకాలు అమలుచేయలేదని, హార్బర్ విస్తరణ, విమానాశ్రయ విస్తరణ చేపట్టలేదని, చౌక దుకాణాలు కొత్తగా ప్రారంభించలేదని ఆరోపించారు. కాగా ప్రతిపక్ష ఎమ్మెల్యేల అరుపులు, కేకలు, నినాదాలతో సభ గందరగోళంగా మారింది. అయినా గవర్నర్ ఆ కేకల మధ్యనే తన ప్రసంగాన్ని ముగించారు.

రోడ్డుపైనే ఉపాధ్యాయులు

● మూడో రోజుకు చేరుకున్న టీచర్ల ఆందోళన



డీపీఐ వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

ప్యారీస్, జూలై 31: తమిళనాడు ప్రాథమిక విద్య టీచర్లు తమ డిమాండ్ల సాధనకోసం చేపట్టిన ఆందోళన బుధవారం మూడో రోజుకు చేరుకుంది. నుంగంబాక్కంలోని డీపీఐ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించిన సుమారు 1,000 మందికి పైగా ఉపాధ్యాయులను పోలీసులు అదుపులోకి తీసుకొని నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న కల్యాణ మండపాలకు తరలించారు. తమిళనాడు ప్రాథమిక విద్య టీచర్ల సమాఖ్య జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో సోమవారం నుంచి డీపీఐ కార్యాలయ ముట్టడించే కార్యక్రమం చేపట్టారు. తూత్తుకుడి, శివగంగ, తేని, కరూర్, పెరంబలూరు, అరియలూరు, సేలం, కడలూరు తదితర జిల్లాలకు చెందిన సుమారు 1,000 మందికి పైగా టీచర్లు తమ 32 డిమాండ్లు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆందోళనపై సంఘ నిర్వాహకులు మాట్లాడుతూ... టీచర్ల న్యాయమైన కోర్కెలను పరిష్కరించకుండా జాప్యం చేయడం సరికాదని, అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తమ సంఘ ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించాలని వారు డిమాండ్ చేశారు.

19న ఎంబీబీఎస్ ర్యాంకుల జాబితా

21 నుంచి వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ● మంత్రి ఎం.సుబ్రమణ్యం



ఆస్పత్రిలో స్కానింగ్ పరికరాన్ని పరిశీలిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం

పెరంబూర్, జూలై 31: రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. గిండిలోని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని బుధవారం సందర్శించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో వైద్య కోర్సుల అడ్మిషన్లకు సంబంధించి తొలివిడత కౌన్సెలింగ్ ఈ నెల 21వ తేది ప్రారంభమవుతుందన్నారు. ముందుగా 19వ తేది అడ్మిషన్లకు సంబంధించి ర్యాంకుల జాబితా విడుదల చేయనున్నామని తెలిపారు. తొలివిడత కౌన్సెలింగ్ ప్రారంభమైన తర్వాత, 7.5 శాతం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రత్యేక కోటా, మాజీ సైనికుల కోటా, దివ్యాంగుల కోటా, క్రీడాకారుల కోటా ఇలా నాలుగు కేటగిరీల్లో 22,23 తేదీల్లో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 35 ప్రభుత్వ వైద్యకళాశాలలు, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో కేకే నగర్ ఈఎస్ఐ వైద్యకళాశాల పనిచేస్తుందన్నారు. ఇవే కాకుండా 21 ప్రైవేటు వైద్యకళాశాలలు, 2 ప్రభుత్వ, 20 ప్రైవేటు దంత వైద్యకళాశాలలున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 11,500 సీట్లున్నాయన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నీట్ నిర్వహణలో జరిగిన అవకతవకల కారణంగా అఖిల భారత కోటా సీట్లకు సంబంధించిన కౌన్సెలింగ్ వాయిదాపడిందన్నారు. సుప్రీ కోర్టు జోక్యం చేసుకున్న తర్వాత ఈ నెల 14వ తేది కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రాష్ట్రంలోని వైద్య కోర్సుల భర్తీకి సంబంధించి రాష్ట్ర వైద్య విద్య, పరిశోధన డైరెక్టర్ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఆ ప్రకారం విద్యార్థులకు సంబంధించిన దరఖాస్తు స్వీకరణ ఆన్‌లైన్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైందని తెలిపారు. అందులో, నీట్‌లో ఉత్తీర్ణులైన వారు ఈ నెల 8వ తేది వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని మంత్రి తెలిపారు.

వృత్తులపై జీసీసీ పన్ను పోటు



ప్యారీస్, జూలై 31: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిశ్రమలు, వాణిజ్య సంస్థల లైసెన్స్ రెన్యువల్, గేమ్స్ సహా 200లకు పైగా వృత్తులపై పన్ను పెంచింది. దీని వలన జీసీసీకి అదనంగా రూ.100 కోట్ల ఆదాయం సమకూర్చే అవకాశముంది. మంగళవారం జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ బిల్డింగ్‌లో మేయర్ ప్రియ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు పన్నులు పెంచుతూ తీర్మానం చేసిన విషయం తెలిసిందే. 2018వ సంవత్సరంలో వృత్తులకు సంబంధించిన పన్నులను సవరించారు. ఆ తర్వాత ప్రస్తుతం ఆరు నెలలకు సంబంధించి వృత్తి పన్ను 35 శాతం వరకు పెంచారు. చిన్న పరిశ్రమలకు రూ.3,500 నుంచి రూ.7,000, మధ్యతరగతి పరిశ్రమలకు రూ.7,000 నుంచి రూ.10,000 వరకు, సూక్ష్మ పరిశ్రమలకు రూ.10,000 నుంచి రూ.20,000 వరకు, భారీ వాణిజ్య పరిశ్రమలకు రూ.15,000 నుంచి రూ.50,000 వరకు లైసెన్స్ ఫీజు పెంచారు. ఇక, వాణిజ్య సంస్థలకు లైసెన్స్ ఫీజు 150 శాతం, చిన్న దుకాణాలకు 50 శాతం చొప్పున పన్ను పెంచారు. రాజధాని నగరంలో టీ షాప్, సెలూన్, కిరాణా షాప్, లాడ్జీ, కల్యాణ మండపాలు, సేవా సంస్థల బహుళ అంతస్తుల భవనాలు, విశ్రాంతి గృహాలకు సంవత్సరానికి 1,000 చ.అ రూ.5,000 చెల్లించాల్సి ఉంటుంది. అందువల్ల వీటిలో అద్దెకున్నవారు యజమానులకు అదనంగా అద్దె చెల్లించాల్సి వస్తుంది. అంతేకాకుండా 5,000 చ.అ పైగా ఉన్న కల్యాణ మండపాలకు ఇప్పటివరకు ఏడాదికి వసూలు చేస్తున్న ఫీజు రూ.4000ల నుంచి రూ.30,000 పెంచారు. అందువల్ల ఇకపై కల్యాణ మండపాల అద్దె పెరిగే అవకాశముంది. టీ షాపులు, హోటళ్లు, మెస్‌లకు 1,000 చ.అ ఇప్పటివరకు వసూలుచేసిన రూ.2,500 ఫీజు రూ.5,000 పెరిగింది.

పార్కింగ్ ఫీజు...

నగరంలో పార్కింగ్ జోన్లుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వాహనాలు పార్కింగ్ అద్దె పెంచారు. 1,000 చ.అ పార్కింగ్ స్థలానికి రూ.5,000, అంతకంటే ఎక్కువ ఉన్న స్థలాలకు రూ.20,000 అద్దె నిర్ణయించారు. సెలూన్ లైసెన్స్ ఫీజు రూ.200 నుంచి రూ.10,000, బ్యూటీపార్లర్లకు రూ.500 నుంచి రూ.6,000, స్పాలకు రూ.25,000 లైసెన్స్ ఫీజుగా నిర్ణయించారు. సెల్‌ఫోన్ దుకాణాలు, ఫొటో స్టూడియోలు, చిన్న దుకాణాలకు 12 నెలలకు లైసెన్స్ ఫీజుగా రూ.3,000 చెల్లించాల్సి ఉంటుంది. బేకరీ షాపులు, సినిమా థియేటర్లు, లాండ్రీ షాపులు, సంతలకు లైసెన్స్ రెన్యువల్, రద్దు చేసేందుకు కమిషనర్‌కు అధికారం అప్పగించారు. నగరపాలక సంస్థ ఇదివరకు ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం 200లకు పైగా పరిశ్రమలు, వాణిజ్య సంస్థలపై పన్నులు పెంచినందువల్ల పలు పరిశ్రమలు మూతపడే ప్రమాదముందంటూ వ్యాపారులు వాపోతున్నారు. ప్రజలపై పన్నుల రూపంలో మరింత ఆర్థిక భారం మోపారని, ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించి పన్నులు తగ్గించేలా జీసీసీకి ఉత్తర్వులు జారీచేయాలంటూ వారు కోరుతున్నారు.

29న 'టి.ఆర్.ఎస్.శర్మ-సాహిత్యం: అవలోకనం' జాతీయ సదస్సు

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 29వ తేదీన 'టి.ఆర్.ఎస్.శర్మ-సాహిత్యం:అవలోకనం' అనే అంశంపై జాతీయ సదస్సు జరుగనుంది. దీనికి సంబంధించిన కరపత్రాన్ని తెలుగు శాఖ ప్రాంగణంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆవిష్కరించారు. తెలుగుశాఖాధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజధాని కళాశాల తెలుగుశాఖ విశ్రాంతాచార్యులు ఎల్‌బి శంకరరావు చేతుల మీదుగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టి.ఆర్.ఎస్ శర్మ దంపతులు, రాజధాని కళాశాల తెలుగుశాఖ అధ్యక్షురాలు డాక్టర్ ఎలిజబెత్ జయకుమారి, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ పాండు రంగం కాళియప్ప, డాక్టర్ మాదా శంకరబాబు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తెలుగు ప్రముఖులు

సమాచార ధ్వని

విదేశీ ఎంప్లాయ్‌మెంట్ సంస్థ వెబ్‌సైట్ మార్పు

ఐసిఎఫ్, జూలై 31: విదేశీ ఉద్యోగ అవకాశాల సంస్థ వెబ్‌సైట్ మారినట్లు ఆ సంస్థ ఎండీ తెలిపారు. ఈ సంస్థ www.omcmanpower.com వెబ్‌సైట్ కాగా, www.omcmanpower.tn.gov.in గా ప్రభుత్వం మార్పు చేసింది. ఈ నేపథ్యంలో, ఇకపై ఈ వెబ్‌సైట్ మాత్రమే వినియోగించాలని విదేశీ ఉద్యోగ అవకాశాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సూచించారు.

తపాలా ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 31: రాష్ట్ర తపాలా శాఖలో ఖాళీగా ఉన్న 3,789 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అభ్యర్థులు ఈ నెల 5వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (ఏబీపీఎం), డక్ సేవక్ వంటి పోస్టులకు టెన్త్, ప్లస్ టూ, డిగ్రీ చదివిన 18 నుంచి 40ఏళ్లలోపున్న వారు అర్హులు. ఈ పోస్టులకు వేతనం రూ.10,000 నుంచి రూ.29,380 వరకు అందజేస్తారు. అభ్యర్థులు దరఖాస్తు రుసుము రూ.100 ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, హిజ్రాలు, మహిళలకు దరఖాస్తు రుసుము లేదు. ఇతర వివరాలు, దరఖాస్తు నమోదుకు www.indiapostgdsonline. gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

టాటానగర్-ఎర్నాకుళం రైళ్లు రద్దు

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హౌరా - ముంబై మధ్య రైల్వేలైను మరమ్మతుల కారణంగా గురువారం బయలుదేరాల్సిన టాటా నగర్ - ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ (18189), ఆగస్టు 4వ తేదీ బయలుదేరాల్సిన ఎర్నాకుళం - టాటా నగర్ ఎక్స్‌ప్రెస్ (18190)లను పూర్తిగా రద్దు చేసినట్లు దక్షిణరైల్వే ప్రకటించింది.

9నుంచి ఫుడ్ ప్రో ఎగ్జిబిషన్

ఐసిఎఫ్, జూలై 31: భారత వృత్తుల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో ఫుడ్ ప్రో-2024 ఎగ్జిబిషన్ నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో ఈ నెల 9,10,11 తేదీల్లో జరుగనుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో వివిధ రకాల ఆహార వస్తువులు ప్రదర్శించనున్నారు. 250 స్వదేశీ, విదేశీ సంస్థలు, 25,000 మంది సందర్శకులు, వర్తకులు పాల్గొననున్నారు.

క్లైమేట్ నాలెడ్జ్ పార్క్

ఐసిఎఫ్, జూలై 31: స్థానిక కిలంబాక్కంలో క్లైమేట్ నాలెడ్జ్ పార్క్ ఏర్పాటుచేస్తున్నట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు. గత ఏడాది డిసెంబరు 30న ప్రారంభించిన కిలంబాక్కం కొత్త బస్ టెర్మినల్ సమీపంలో 16.90 ఎకరాల స్థలంఉంది. ఇక్కడ రూ.14.76 కోట్లతో క్లైమేట్ నాలెడ్జ్ పార్క్ ఏర్పాటుచేస్తున్నారు. దేశంలో తొలి క్లైమేట్, పురావస్తు పార్క్‌గా ఏర్పాటుకానుందని, త్వరలో ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

సహాయ కమిషనర్ల బదిలీ

ఐసిఎఫ్, జూలై 31: నలుగురు పోలీసు సహాయ కమిషనర్లను బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీచేశారు. తాంబరం కమిషనర్ కార్యాలయంలో సాయుధ దళ సహాయ కమిషనర్ రాజా టి.నగర్ సహాయ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అడయార్ ట్రాఫిక్ సహాయ కమిషనర్ తిరువేంగడం తాంబరం కమిషనర్ కార్యాలయంలో సాయుధ దళం సహాయ కమిషనర్‌గా నియమితులయ్యారు. టి.నగర్ ట్రాఫిక్ విభాగం సహాయ కమిషనర్ కొడిసెల్వన్ అడయార్ ట్రాఫిక్ విభాగానికి బదిలీ అయ్యారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జూలై 31: స్థానిక అడయార్‌లో గురువారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. వేళచ్చేరి మెయిన్ రోడ్డులోని ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే గ్రీవెన్స్‌లో అడయార్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు హాజరై సమస్యలు తెలియజేయవచ్చని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాలల్లో అన్నా వర్సిటీ ఫీల్డ్ సర్వే

ఐసిఎఫ్, జూలై 31: ఇంజనీరింగ్ కళాశాలల్లో అన్నా విశ్వవిద్యాలయం ఫీల్డ్ సర్వే చేయనుంది. ఈ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వున్న ఇంజనీరింగ్ కళాశాలల్లో అంగీకారం, అనుబంధ హోదా పొందేందుకు కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించి వివిధ రకాల సర్టిఫికెట్లు సమర్పించాలి. మౌలిక వసతులు నేరుగా పరిశీలించేందుకు అన్నా వర్సిటీ నిర్ణయించింది. మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కాకముందే ఈ ప్రక్రియ ముగించాలని నిర్ణయించింది.

లా కోర్సుల దరఖాస్తు సమర్పణ గడువు పొడిగింపు

పెరంబూర్, జూలై 31: లా కోర్సుల దరఖాస్తు గడువు పెంచుతూ తమిళనాడు డా.అంబేడ్కర్ న్యాయ విశ్వవిద్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. రెండేళ్ల, మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్‌బీ (హానర్స్) కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైంది. దరఖాస్తు స్వీకరణ బుధవారంతో ముగిసిన నేపథ్యంలో, రెండేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు ఈ నెల 5వ తేది వరకు, మూడేళ్ల కోర్సుకు ఈ నెల 10వ తేది వరకు గడువు పొడిగిస్తూ వర్సిటీ ప్రకటన విడుదల చేసింది.

వయనాడ్ బాధితులకు విక్రమ్ రూ.20 లక్షల విరాళం

అడయార్, జూలై 31: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు అగ్రహీరో చియాన్ విక్రమ్ కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.20 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో అనేక మది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రాంతంలో సహాయక చర్యలు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సహాయక చర్యలతోపాటు బాధితులను ఆదుకునేందుకు విక్రమ్ ఈ విరాళాన్ని ప్రకటించారు. కాగా 2018లో వచ్చిన కేరళ వరదల సమయంలో కూడా ఆయన రూ.35 లక్షలు విరాళం అందించిన విషయం తెల్సిందే.

టీఎన్‌సీసీ రూ.కోటి విరాళం

వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) తరఫున రూ.కోటి విరాళాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుందగై బుధవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

ఢిల్లీ వెళ్లిన గవర్నర్ ఆర్ఎన్ రవి

ప్యారీస్, జూలై 31:దేశరాజధాని ఢిల్లీలో గురువారం జరుగనున్న గవర్నర్ల మహానాడులో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొననున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన జరుగనున్న మహానాడులో పాల్గొనేందుకు గవర్నర్ బుధవారం సాయంత్రం నగరం నుంచి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు.ఆయన పదవీకాలం బుధవారంతో ముగిసిన నేపథ్యంలో, అధికార పర్యటనగా గవర్నర్ల మహానాడులో పాల్గొనడంవల్ల గవర్నర్ పదవిలో కొనసాగే అవకాశంఉందని స్పష్టమవుతోంది.

భవానీసాగర్‌లో పెరుగుతున్న నీటిమట్టం

● నీటమునిగిన అరటి పంట



అరటి గెలలు తీసుకెళ్తున్న కార్మికులు

పెరంబూర్, జూలై 31: భవానీ సాగర్ జలాశయంలో నీటిమట్టం పెరుగుతుండడంతో, సిరుముగై ప్రాంతంలో వేలాది ఎకరాల్లో అరటి తోటలు నీటమునిగాయి. కోవై జిల్లా సిరుముగై భవానీసాగర్ జలాశయం పరివాహక ప్రాంతాలైన లింగాపురం, కందవయల్ తదితర ప్రాంతాల్లో రైతులు అరటి సాగు చేపడుతుంటారు. కొద్దిరోజులుగా కేరళ, నీలగిరి కొండ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మేట్టుపాళయంలోని పిల్లూరు డ్యాం నీటి ప్రవాహం పెరగడంతో అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు భవానీ సాగర్ డ్యాంకు చేరుకుంటోంది. డ్యాం పరిసర ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన అరటి చెట్లు నీటమునిగాయి. దీంతో కార్మికులు అరటి గెలలు కోస్తున్నారు. అయినా, వేలాది అరటి గెలలు నీటమునిగాయని రైతుల వాపోతున్నారు.

వ్యాపారవేత్త బాలాజీ నివాసంలో రెండో రోజూ సోదాలు

అడయార్, జూలై 31: నగరానికి చెందిన వ్యాపారవేత్త బాలాజీ నివాసంలో ఈడీ అధికారులు రెండో రోజైన బుధవారం కూడా సోదాలు చేశారు. స్థానిక కొట్టివాక్కంకు చెందిన వ్యాపారవేత్త, సినీ ఫైనాన్షియర్ అయిన బాలాజీ.. తన స్నేహితుడైన సినీ నిర్మాత రవీంద్ర చంద్రశేఖరన్‌కు మున్సిపాలిటీ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్కీమ్‌లో ఇన్వెస్ట్ చేసే నిమిత్తం రూ.16 కోట్లు ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆయన ఇన్వెస్ట్ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. బాలాజీ ఫిర్యాదు మేరకు చెన్నై సెంట్రల్ సీబీడీ పోలీసులు కేసునమోదు చేసి, గతయేడాది అరెస్టు చేశారు. పైగా ఎలాంటి ఆధారాలు లేకుండానే ఈ డబ్బు ఇచ్చినట్టు తేలింది. ఈ అంశాన్ని ఈడీ దృష్టికి తీసుకెళ్ళడంతో రంగంలోకి దిగిన ఈడీ అధికారులు.. మంగళవారం ఈ ఇద్దరి నివాసాల్లో తనిఖీలు చేశారు. రెండో రోజైన బుధవారం కూడా వ్యాపారవేత్త బాలాజీ నివాసంలో తనిఖీలు చేయగా, కోట్లాది రూపాయలకు సంబంధించి విలువైన పత్రాలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

లెమన్ జ్యూస్‌లో ప్లాస్టిక్ దారం

● దుకాణ యజమానికి రూ.2,000 జరిమానా

పెరంబూర్, జూలై 31: స్థానిక తిరుమంగళంలోని ఓ దుకాణంలో జ్యూస్‌లో ప్లాస్టిక్ దారం ఉండడంతో వినియోగదారుడు దిగ్భ్రాంతి చెందాడు. కేకే నగర్ ప్రాంతానికి చెందిన సౌందర్‌రాజన్ (46) తిరుమంగళంలోని ఓ దుకాణంలో లెమన్ జ్యూస్ తాగిన సమయంలో అందులో ఉన్న ప్లాస్టిక్ దారాన్ని గుర్తించి, దుకాణ యజమానికి చెప్పగా అతడు నిర్లక్ష్యంగా సమాధానిమిచ్చాడు. అలాగే, దుకాణ యజమాని ధనపాల్ ఈ విషయమై సౌందర్‌రాజన్‌ను బెదిరించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై తిరుమంగళం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సౌందర్‌రాజన్, సెల్‌ఫోన్‌లో లెమన్ జ్యూస్‌లో ప్లాస్టిక్ దారం ఉండే ఫోటో తీసి, వాట్సాప్ ద్వారా ఆహార భద్రతా శాఖ అధికారులకు పంపించాడు. దీంతో, ఆహార భద్రతా శాఖ అధికారి కార్మేగం జ్యూస్ దుకాణానికి చేరుకొని విచారించారు. జ్యూస్ కోసం వినియోగించే పండ్లపై దుమ్ము ఉండడం, ప్లాస్టిక్ కవర్లు కుప్పలా పోసి ఉండడం, తాగునీటి క్యాన్ పరిశుభ్రంగా ఉండడం తదితరాలు గుర్తించి, దుకాణ యజమానికి రూ.2,000 జరిమానా విధించారు.

ఆస్పత్రిలో చేరిన మాజీ మంత్రి నత్తం

అడయార్, జూలై 31: అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి నత్తం విశ్వనాథన్ అస్వస్థతకు లోనయ్యారు. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్చారు. మంగళవారం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి అధ్యక్షతన పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో కూడా పాల్గొన్నారు. అయితే, ఈ సమావేశం అవకముందే ఆయన ఇంటికి వెళ్ళిపోయారు. నరాల బలహీనత సమస్య ఉండటంతో మంగళవారం ఉన్నట్టుండి అస్వస్థతకు లోనయ్యారు. దీంతో ఆయనను థౌజండ్‌లైట్ ప్రాంతంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌పేషెంటుగా చికిత్స పొందుతున్న విశ్వనాథన్ ఆరోగ్యం క్రమంగా కుదుటపడుతున్నట్టు సమాచారం.

పెయిన్ కిల్లర్ మాత్రల విక్రయం.. ఇద్దరి అరెస్టు

అడయార్, జూలై 31: ముంబై నుంచి అక్రమంగా నగరానికి తీసుకొచ్చి పెయిన్ కిల్లర్ ట్యాబెట్లను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను నగర పోలీసులు అరెస్టు చేశారు. వీరిని ఒట్టేరిలోని పాత వాషైమానగర్ ప్రాంతానికి చెందిన సంతోష్ (22), హబీబుల్లా (30) అనే వారిగా గుర్తించారు. హబీబుల్లాతో కలిసి సంతోష్ ఈ మాత్రలను పెరంబూరు, ఓట్టేరి, పులియంతోపు తదితర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో విక్రయించినట్టు పోలీసులు విచారణలో తేలింది. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ వెల్లడి



అంతరిక్ష దినోత్సవాల్లో పాల్గొన్న షార్ డైరెక్టర్, కళాశాల యాజమాన్యం

సూళ్లూరుపేట, జూలై 31: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భాగా పట్టు సాధించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా నెల రోజుల పాటు స్పేస్ డే సంబరాలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇస్రో, షార్ సంయుక్తంగా శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఇందులో భాగంగా బుధవారం తమిళనాడు తిరువళ్లూరులోని ప్రత్యూష ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ దేశాల్లో భారత్‌ను అంతరిక్ష రంగలంలో శక్తివంతంగా నిలపడమే లక్ష్యంగా ఇస్రో శాస్త్రవేత్తలు పనిచేస్తున్నారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఇప్పటి నుంచే పట్టుదలతో చదవితే శాస్త్రవేత్తలుగా ఎదగ వచ్చన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్పేస్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఇస్రో ప్రయోగించే రాకెట్లు, ఉపగ్రహాలు వాటి ఉపయోగాలు తదితర వాటి పై అవగాహన కల్పించారు.

పాఠశాల వ్యాన్ బోల్తా .. విద్యార్థులకు గాయాలు



బోల్తా పడిన వ్యాన్

పెరంబూర్, జూలై 31: శివగంగ సమీపంలో పాఠశాల వ్యాన్ బోల్తాపడిన ఘటనలో 15 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులు బుధవారం తరగతులు ముగిసిన అనంతరం పాఠశాల వ్యాన్‌లో ఇళ్లకు బయల్దేరారు. వ్యాన్ టైర్ పూర్తిగా దెబ్బతిని, గ్రిప్ లేని కారణంగా రోడ్డుపై మలుపు తిరుగుతుండగా పక్కకు ఒరిగిపోయింది. దీంతో విద్యార్థులంతా కేకలు పెట్టారు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని వ్యాన్ నుంచి విద్యార్థులను వెలికితీసి 108 అంబులెన్స్ ద్వారా సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సిగరెట్ లైటర్లపై నిషేధం విధించాలి

● స్పీకర్ అప్పావు

పెరంబూర్, జూలై 31: ప్లాస్టిక్ సిగిరెట్ లైటర్లపై నిషేధం విధించాలని అసెంబ్లీ స్పీకర్ అప్పావు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు లేఖ రాశారు. ఈ మేరకు లేఖలో వివరాలిలా ఉన్నాయి.. విరుదునగర్, తూత్తుకుడి, తిరునల్వేలి, కృష్ణగిరి జిల్లాల్లో అగ్గిపెట్టెల తయారీ కర్మాగారాల్లో వేలాది మంది పనిచేస్తున్నారన్నారు. గతంలో ఈ జిల్లాల నుంచి విదేశాలకు అగ్గిపెట్టెలు ఎగుమతి చేసేవారన్నారు. ఈ నేపథ్యంలో, చైనా నుంచి ప్లాస్టిక్ లైటర్ల దిగుమతులతో ఈ పరిశ్రమ తీవ్రంగా నష్టపోయిందన్నారు. అగ్గిపెట్టెల పరిశ్రమను పరిరక్షించేలా చైనా ప్లాస్టిక్ లైటర్ల దిగుమతులపై నిషేధం విధించాలని 2022 సెప్టెంబరు 8వ తేది తాము రాసిన లేఖపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం, చైనా లైటర్లపై నిషేధం విధించిందని తెలిపారు. అలాగే, విదేశీ అగ్గిపెట్టెల విక్రయాలకు కూడా నిషేధం విధించారన్నారు. చైనా లైటర్లకు నిషేధం విధించినా, కొన్ని ఉత్తర దేశాలు లైటర్లకు సంబంధించి విడిభాగాలు దిగుమతి చేసుకొని తయారుచేస్తున్నాయన్నారు. అలాగే, తక్కువ ధరకు లైటర్లు విక్రయిస్తుండడంతో అగ్గిపెట్టెల పరిశ్రమ నష్టాలు ఎదుర్కొంటుందన్నారు. అందువల్ల చైనా ప్లాస్టిక్ లైటర్ల విక్రయాలు, వినియోగంపై నిషేధం విధించాలని స్పీకర్ అప్పావు లేఖ ద్వారా సీఎంకు విజ్ఞప్తి చేశారు.

గృహ నిర్మాణ అనుమతుల వ్యవహారం... పాత ఛార్జీలనే కొనసాగించండి

● ప్రభుత్వానికి ఈపీఎస్ డిమాండ్

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణానికి అనుమతులిచ్చే వ్యవహారంలో పాత చార్జీలనే కొనసాగించాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) డిమాండ్ చేశారు. బుధవారం ఆయన చెన్నైలో మీడియాతో మాట్లాడుతూ... ఈ నెల కార్పొరేషన్, సీఎండీఏ ప్రచురించిన ఆదేశాల్లో గృహ నిర్మాణ ప్లాన్ అనుమతి కోసం ఆన్‌లైన్‌లో తగిన ఫీజు కట్టి అనుమతి పొందవచ్చన్నారని, కానీ ఆ ఫీజు భారీగా పెంచారన్నారు. ఆ ఫీజులు చూస్తే సొంతిల్లు కట్టుకోవాలనుకునేవారు ఖంగుతినేలా వుందన్నారు. ఇంటి ప్లాన్ అనుమతి కోసం చెన్నైలో వెయ్యి చదరపు అడుగులకు రూ.46 వేల నుంచి లక్ష వరకు పెంచారన్నారు. కోయంబత్తూరు, మదురై, తిరుప్పూర్ తదితర కార్పొరేషన్లలో వెయ్యి చదరపు అడుగులకు రూ.42 వేల నుంచి రూ.88 వేలకు పెంచారన్నారు. తిరుచ్చి, సేలం, తాంబరం కార్పొరేషన్లకు రూ.30 వేల నుంచి రూ.84 వేలకు పెంచారన్నారు. అదే విధంగా పట్టణాలు, పంచాయతీల్లోనూ ఈ ఫీజులు భారీగా పెంచారన్నారు. అందువల్ల ఈ పెంచిన చార్జీలను తక్షణం తగ్గించాలని, పాత చార్జీలనే కొనసాగించాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.

రెండు ఆమ్నీ బస్సుల ఢీ

● 30 మందికి గాయాలు



ప్రమాదం జరిగిన దృశ్యం

పెరంబూర్, జూలై 31: కుంభకోణం జాతీయ రహదారిలోని వయలూరు ప్రాంతంలో రెండు ఆమ్నీ బస్సులు బుధవారం ఉదయం ఢీకొన్న ఘటనలో 30 మందికి గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉండడమే ప్రమాదానికి కారణమని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. తంజావూరు నుంచి కుంభకోణానికి, కుంభకోణం నుంచి తంజావూరుకు రెండు మార్గాల్లో సుమారు 200 ప్రయాణికులతో రెండు ఆమ్నీ బస్సులు బయల్దేరాయి. ఆ బస్సులు వయలూరు ప్రాంతంలో ఎదురెదురుగా ఢీ కొనడంతో కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు సహా 30 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని క్షతగాత్రులను తంజావూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సాంకేతికలోపం పొలాల్లో దిగిన వాయుసేన హెలికాప్టర్



సాంకేతిక లోపానికి గురైన హెలికాప్టర్

పెరంబూర్, జూలై 31: కాంచీపురం జిల్లాలో సాలవాక్కం గ్రామం సమీపంలోని పొలాల్లో హఠాత్తుగా హెలికాప్టర్ దిగడం కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని విచారించగా .. తాంబరం వాయుసేన మైదానం నుంచి శిక్షణ కోసం బయల్దేరిన హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో పొలాల్లో ల్యాండింగ్ చేసినట్లు తెలిపారు. హెలికాప్టర్ నుంచి ఒక పైలెట్, ట్రైనీ పైలెట్‌లు సురక్షితంగా బయటపడ్డారు. కొద్దిసేపటికి అనంతరం మరో హెలికాప్టర్‌లో అక్కడకు చేరుకున్న సాంకేతిక నిపుణులు మరమ్మతులు పూర్తిచేసిన తర్వాత, రెండు హెలికాప్టర్లు వెళ్లాయి. కాగా, హెలికాప్టర్లను చూసేందుకు ప్రజలు అక్కడికి పెద్దసంఖ్యలో చేరుకోవడంతో ఆ ప్రాంతం సందడిగా మారింది.

ఆస్పత్రిలో చేరిన రాందాస్

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పీఎంకే అధినేత డాక్టర్ రాందాస్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరినట్లు తెలిసింది. 85 ఏళ్ల వయసున్న ఆయన.. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. అందువల్ల ప్రతి రెండు నెలలకు ఒకసారి ఆసుపత్రిలో చేరడం సాధారణమని, అయితే ఈ సారి అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరినట్లు పీఎంకే వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని వివరించాయి. సాధారణ పరిశీలన అనంతరం.. ఆయన్ని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేస్తున్నట్లు పేర్కొన్నాయి.

విమానం హైజాక్ అడ్డుకొనేలా మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ దృశ్యాలు

పెరంబూర్, జూలై 31: స్థానిక అంతర్జాతీయ విమానాశ్రయంలో హఠాత్తుగా ఉగ్రవాదులు విమానాన్ని హైజాక్ చేస్తే, దానిని అడ్డుకోవడం, ఉగ్రవాదులను బంధించడం, విమానానికి, ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం లేకుండా కాపాడడం తదితరాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ విమానంలో నలుగురు ఉగ్రవాదులు ప్రవేశించడం, విమానం హైజాక్ చేశామని ప్రకటించడం, దీంతో, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు రన్‌వేపై ఉన్న విమానాన్ని చుట్టుముట్టి, విమానంలోకి ప్రవేశించి నలుగురు ఉగ్రవాదులను బంధించడం తదితరాలు జరిగాయి. తొలుత ఈ మాక్ డ్రిల్‌పై ఎలాంటి ప్రకటన లేకపోవడం, భద్రతా దళాలు తుపాకులతో రన్‌వే వద్దకు పరుగులు తీయడం ప్రయాణికులను భయాందోళనలకు గురిచేశాయి. అనంతరం ఇది మాక్ డ్రిల్ అని ప్రకటించడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి మాక్ డ్రిల్ ఆరు నెలల క్రితం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

అసెంబ్లీలో గుట్కా వ్యవహారం... సీఎం సహా డీఎంకే ఎమ్మెల్యేలు వివరణ ఇవ్వాలి

● ఆదేశించిన మద్రాస్ హై కోర్టు



పెరంబూర్, జూలై 31: గత అన్నాడీఎంకే హయాంలో శాసనసభలో గుట్కా తీసుకెళ్లిన అంశంపై నోటీసుల ఉల్లంఘన నోటీసుపై హక్కుల కమిటీకి వివరణ ఇవ్వాలని ప్రస్తుత ముఖ్యమంత్రి సహా డీఎంకే ఎమ్మెల్యేలను మద్రాసు హైకోర్టు ఆదేశించింది. 2017 అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో, శాసనసభలో గుట్కా తీసుకెళ్లినందుకు అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ సహా డీఎంకే ఎమ్మెల్యేలపై ఉల్లంఘన నోటీసులు పంపారు. ఈ నోటీసులు రద్దు చేస్తూ మద్రాసు హైకోర్టు సింగిల్ జడ్జి జారీచేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే అప్పీలు పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను బుధవారం న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, న్యాయమూర్తి సి.కుమరప్పన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ధర్మాసనం... ఉల్లంఘన నోటీసుపై పిటిషన్ దాఖలైంది. కాబట్టి, ఆ ఉల్లంఘన నోటీసు ఒక ముగింపునకు చేరుకోవాలి. గత అసెంబ్లీ పదవీకాలం ముగియడంతో హక్కుల ఉల్లంఘన అంశం ముగిసిపోయిందని డీఎంకే ఎమ్మెల్యేలు చేసిన వాదన అంగీకరించలేం. ఉల్లంఘన నోటీసు రద్దు చేస్తూ 2021 ఫిబ్రవరిలో సింగిల్ జడ్జి జారీచేసిన ఉత్తర్వులు రద్దు చేయబడ్డాయి. కనుక ముఖ్యమంత్రి స్టాలిన్ సహా డీఎంకే ఎమ్మెల్యేలు ఈ ఉల్లంఘన నోటీసుపై హక్కుల కమిటీకి సరైన వివరణ ఇవ్వాలి. శాసనసభ హక్కుల కమిటీ సంబంధిత నిబంధనలు అనుసరించి విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది.

తిరుమావళవన్‌కు పీడీ వారెంట్

పెరంబూర్, జూలై 31: డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్‌కు మైలాడుదురై ప్రిన్సిపల్ కోర్టు పీడీ వారెంట్ జారీచేసింది. మైలాడుదురైలో 2003లో డీపీఐ ఆధ్వర్యంలో మతమార్పిడి చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన జరిగింది. కేసు విచారణకు వచ్చిన సమయంలో, న్యాయవాదుల సమ్మె కారణంగా తిరుమావళవన్ తరఫున న్యాయవాదులు పిటిషన్ వేసినా, తిరుమావళవన్‌కు కోర్టు న్యాయమూర్తి ఆర్.విజయకుమారి పీడీ వారెంట్ జారీచేసి, కేసు విచారణ ఈ నెల 27వ తేదీకి వాయిదావేశారు.

మాజీ మంత్రి విజయభాస్కర్‌కు బెయిలు మంజూరు

పెరంబూర్, జూలై 31: మాజీ మంత్రి ఎమ్మార్ విజయభాస్కర్‌కు న్యాయస్థానం నిబంధనలతో కూడిన బెయిలు మంజూరు చేసింది. భూకబ్జా, హత్యా బెదిరింపుల కేసుకు సంబంధించి అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎమ్మార్ విజయభాస్కర్‌ను గత నెల 16వ తేది సీబీసీఐడీ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి తిరుచ్చి సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో, రెండు కేసుల్లో బెయిలు కోరుతూ కరూర్ క్రిమినల్ కోర్టులో ఎమ్మార్ విజయభాస్కర్ పిటిషన్ వేశారు. దీనిని విచారించిన న్యాయమూర్తి నిబంధనలతో కూడిన బెయిలు మంజూరు చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు విజయభాస్కర్ ప్రతిరోజు సీబీసీఐడీ కార్యాలయంలో సంతకం చేయాలి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఈ కేసులో అరెస్టయిన ఇన్‌స్పెక్టర్ పృథ్వీరాజ్‌కు కూడా కరూర్ కోర్టు బెయిలు మంజూరు చేసింది.

విమానాశ్రయానికి మళ్లీ బాంబు బెదిరింపు

పెరంబూర్, జూలై 31: స్థానిక మీనంబాక్కంలోని విమానాశ్రయానికి ఈ-మెయిల్ ద్వారా మళ్లీ బాంబు బెదిరింపు వచ్చింది. అలాగే, ఈ విమానాశ్రయం నుంచి బయల్దేరే ముంబై, గోవా, బెంగళూరు విమానాల్లో కూడా బాంబులు ఉంచినట్లు ఈ-మెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో, కేంద్ర పారిశ్రామిక బలగాలు, బాంబ్ స్క్వాడ్ విమానాశ్రయం అంతా గాలించి బెదిరింపు వార్తలో నిజం లేదని తేల్చారు. కొద్దిరోజులుగా నగరంలోని పలు విద్యాసంస్థలు, విమానాశ్రయానికి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. సైబర్ క్రైం పోలీసులు ఈ-మెయిల్ చిరునామా కోసం విచారణ చేపట్టారు.

కోర్టు విచారణకు హాజరైన నటి గౌతమి

పెరంబూర్, జూలై 31: భూ కుంభకోణం కేసులో నటి గౌతమి కాంచీపురం కోర్టులో విచారణకు హాజరయ్యారు. తిరువళ్లూర్ జిల్లా కొట్టైయూర్‌లోని తన భూమిని విక్రయించాలని గౌతమి కోరగా అళగప్పన్ తన స్నేహితులతో కలసి గౌతమి ఆస్తులు కాజేసి మోసానికి పాల్పడ్డాడు. అళగప్పన్ తన భూమిని దొంగిలించి మోసం చేశాడని నటి గౌతమి కాంచీపురం జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో నిందితుడైన అళగప్పన్ బెయిలు కోరుతూ పిటిషన్ దాఖలుచేశారు.

కీలడిలో బయల్పడిన మట్టి పైప్‌లైన్

ఐసిఎఫ్, జూలై 31: శివగంగై జిల్లా కీలడిలో చేపట్టిన తవ్వకాల్లో మట్టి పైప్‌లైన్ బయల్పడింది. రాష్ట్ర పురావస్తుశాఖ కీలకడిలో ఎనిమిది ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇది వరకే క్రీ.పూ. 6వ శతాబ్దానికి చెందిన కుండపెంకులపై వున్న తమిళ ప్రాచీన లిపి కనుగొన్నారు. మంగళవారం జరిగిన తవ్వకాల్లో బంకమట్టితో తయారు చేసిన గొట్టాలను ఒక దానిలో మరొకటి అమర్చి పైప్‌లైన్ ఏర్పాటు చేయడాన్ని గుర్తించారు. ఒక గొట్టం పొడవు 36 సెం.మీ, వెడల్పు 18 సెం.మీ కలిగి వుందని పురావస్తు శాఖాధికారులు తెలిపారు.

రవాణా సంస్థల్లో ఐదుగురు అధికారుల బదిలీ

ఐసిఎఫ్, జూలై 31: రవాణా సంస్థల్లో అధికారులు ఐదుగురిని బదిలీ చేస్తూ ఆ శాఖ కార్యదర్శి ఫణీంద్రరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నై రోడ్డు రవాణా సంస్థ అదనపు డైరెక్టర్ సింగారవేలు, మదురై రవాణా సంస్థ ఎండీగా బదిలీ అయ్యారు. కుంభకోణం రవాణా సంస్థ ఎండీ మహేంద్రకుమార్ గుమ్మిడిపూండి రవాణా సంస్థ అదనపు డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. సేలం రవాణా సంస్థ ఎండీ పొన్ముడి, కుంభకోణం రవాణా సంస్థ ఎండీగా బదిలీ అయ్యారు. తిరునల్వేలి రవాణా సంస్థ ఎండీ ఇళంగోవన్ సేలం రవాణా సంస్థ ఎండీగా బదిలీ అయ్యారు. గుమ్మిడిపూండి రవాణా సంస్థ అదనపు డైరెక్టర్ దశరథన్ తిరునెల్వేలి రవాణా సంస్థ ఎండీగా బదిలీ అయ్యారు.

రెడ్‌హిల్స్‌లో గంజాయి స్వాధీనం

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెడ్‌హిల్స్‌లో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పాడియనల్లూరు చెక్ పోస్టు వద్ద ఈ తనిఖీలు జరగ్గా, ఓ వాహనం నుంచి 3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనదారుడిని విచారించగా మంజంబాక్కంకు చెందిన ప్రవీణ్‌కుమార్ (22), సత్యవేడుకు చెందిన కార్తీక్ (32), మనలి ప్రాంతానికి చెందిన రంగనాథన్ (61), ఆదిక్కంమేడుకు చెందిన విశ్వనాథన్ ఆంధ్రా నుంచి గంజాయి తరలిస్తున్నట్లు తెలిసింది. దాంతో వారిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. అదే విధంగా మీంజూరు ఔటర్ రింగురోడ్డు వద్ద ఓ ద్విచక్రవాహనం నుంచి 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనదారుడు కాట్టుపాక్కంకు చెందిన లోకనాథన్‌గా గుర్తించి, అతనిని అరెస్టు చేశారు. మరో వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సీఎం నివాసం వద్ద ఎస్‌ఐతో గొడవ పడ్డ వ్యక్తి అరెస్టు

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వారుపేటలోని ముఖ్యమంత్రి స్టాలిన్ ఇంటి వద్ద డ్యూటీలో ఉన్న ఎస్సైతో మద్యంమత్తులో గొడవకు దిగిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. సీఎం నివాసం వద్ద పోలీసు కాపలా ఉంటుంది. అటువైపు వచ్చే అనుమానాస్పద వ్యక్తుల్ని సైతం అదుపులోకి తీసుకుని విచారిస్తారు. ఈ నేపథ్యంలో గత 28వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో సీఎం నివాసం ఇంటి 9వ పాయింట్‌లో ఎస్ఐ నరేంద్రన్ నేతృత్వంలోని పోలీసులు డ్యూటీలో ఉన్నారు. ఆ సమయంలో అక్కడకు మద్యం మత్తులో వచ్చిన ఓ యువకుడు పోలీసులతో గొడవపడ్డాడు. దాంతో వారు తేనాంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు అతడిని అరెస్టు చేశారు. తేనాంపేట భక్తవత్సలం వీధికి చెందిన సురేష్‌గా పోలీసులు గుర్తించారు. అతను ఓ ఆన్‌లైన్ యాప్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నట్టు గుర్తించారు. గతనెల 26వ తేదీ అటు వైపు వచ్చిన తన స్నేహితుడు రాజేంద్రన్‌ను పోలీసులు అన్యాయంగా అరెస్టు చేశారంటూ ముఖ్యమంత్రి ఇంటి వద్ద ఫిర్యాదు చేసేందుకు వచ్చిన సురేష్ అక్కడున్న భద్రతా సిబ్బందితో గొడవకు దిగాడు.

విమానాశ్రయంలో రూ.65 లక్షల గంజాయి స్వాధీనం

ప్యారీస్, జూలై 31: థాయ్‌ల్యాండ్ నుంచి విమానంలో నగరానికి అక్రమంగా తరలించిన రూ.65 లక్షల విలువైన 650 గ్రాముల మేలురకం గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి మంగళవారం అర్ధరాత్రి వచ్చిన థాయ్ ఎయిర్‌లైన్స్ విమానంలో ప్రయాణికుల లగేజీని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. నగరానికి చెందిన యూసఫ్ మదీన్ (50) అనే ప్రయాణికుడిపై అనుమానంతో అదుపులోకి తీసుకున్న అధికారులు, అతని సూట్‌కేస్ తనిఖీ చేసి గంజాయి గుర్తించారు. అధిక మోతాదులో మత్తు కలిగించే ఈ మేలు రకం గంజాయి విలువ అంతర్జాతీయ మార్కెట్లో రూ.65 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. యూసఫ్ మదీన్‌ను అరెస్ట్‌చేసి విచారిస్తున్నారు.

అపర్ణతి అక్కడ ఉండటమే తమిళ సినిమాకు మంచిది

● నిర్మాత సురేష్ కామాక్షి ఆగ్రహం

చిత్రజ్యోతి

నడిగర్ సంఘంలో సభ్యత్వమే లేని వేరే రాష్ట్రానికి చెందిన హీరోయిన్ అపర్ణతిపై ప్రముఖ నిర్మాత సురేష్ కామాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్ర ప్రమోషన్ కోసం రూ.3 లక్షలు ఇవ్వాలంటూ డిమాండ్ చేసిన ఏకైక నటి అపర్ణతి అని, ఆమె ఎప్పుడూ 'ఔట్ ఆఫ్ స్టేషన్'లోనే ఉండాలని, అలా ఉంటేనే తమిళ చిత్రసీమకు ఎంతో మంచిదన్నారు. వీ6 ఫిల్మ్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై ఎస్.వేలాయుధం నిర్మాణ సారథ్యంలో తెరకెక్కిన చిత్రం 'నర్కరాపోర్'. దర్శకులు హెచ్.వినోద్, రాజపాండి తదితరుల వద్ద పనిచేసిన శ్రీవెత్రి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. పారిశుద్ధ్య కార్మిక కుటుంబానికి చెందిన ఒక యువకుడు గ్రాండ్ మాస్టర్ ఎలా అవుతాడు? తన లక్ష్య సాధనలో చదరంగం క్రీడలో ఎదుర్కొన్న సవాళ్ళు ఏమిటి? తదితర అంశాలతో స్పోర్ట్స్ డ్రామాతో ఈ సినిమాను రూపొందించారు. 'ఇరుగపట్రు' సినిమాలో నటించి మంచి గుర్తింపు పొందిన అపర్ణతి ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషించారు. 'సేతుమన్' ఫేం అశ్విన్ హీరోగా, సురేష్ మేనన్ ప్రతి నాయకుడిగా నటించారు. ప్రముఖ మలయాళ దర్శకుడు మేజర్ రవి తనయుడు అర్జున్ రవి ఈ సినిమా ద్వారా కెమెరామెన్‌గా పరిచయమవుతున్నారు. సంతోష్ నారాయణన్‌తో కలిసి పనిచేసిన దినేష్ ఆంటోనీ సంగీతం సమకూర్చారు. నిర్మాత సురేష్ కామాక్షి తన సొంత నిర్మాణ సంస్థ వి హౌస్ బ్యానరులో సినిమాను రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేయగా, మంగళవారం రాత్రి ట్రైలర్, ఆడియో రిలీజ్ చేశారు. ఈ నెల 9వ తేదీన సినిమాను విడుదల చేస్తున్నారు. నిర్మాత సురేష్ కామాక్షి మాట్లాడుతూ, 'ఇండస్ట్రీలో సక్సెస్, ఫెయిల్యూర్స్ ముఖ్యం కాదు. కంటెంట్ ప్రధానం. ఈ మధ్య కాలంలో మంచి కంటెంట్‌తో తెరకెక్కిన చిన్న చిత్రాలే మంచి విజయాన్ని సాధించి కలెక్షన్లు రాబట్టాయి. హీరోయిన్ అపర్ణతి ఈ సినిమా ప్రమోషన్‌కు రాకపోవడం విచారకరం. నటీనటులు ప్రమోషన్లకు రాకపోవడం పరిశ్రమకు ఒక



'నర్కరాపోర్' ఆడియో రిలీజ్ దృశ్యం

శాపంలా మారింది. ఈ సినిమా ప్రమోషన్‌కు వచ్చేందుకు అపర్ణతి రూ.3 లక్షలు డిమాండ్ చేశారు. పైగా అనేక కండిషన్లు కూడా పెట్టారు. అవన్నీ బహిర్గతం చేస్తే పెద్ద వివాదమే అవుతుంది. ఇపుడు ఔటాఫ్ స్టేషన్‌లో ఉన్నారట.. ఆమె అక్కడ ఉండటమే తమిళ సినిమాకు మంచిది' అన్నారు. నటి నమిత మాట్లాడుతూ, 'తమిళ అభిమానులకు సినిమా అంటే వినోదం. సమాజానికి కావాల్సిన సందేశం కూడా ఉండాలి. దేశంలో క్రీడా రంగం అభివృద్ధి చెందుతుంది. ఈ పరిసర ప్రాంతాల్లో ఉండే పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తి ఉంటే వారిని ప్రోత్సహించాలి' అని పిలుపునిచ్చారు. అలాగే, దర్శకులు అముదగానం, యురేఖ, లెనిన్ భారతి, సుబ్రహ్మణ్యశివ, మీరా కదిరవన్, నటుడు కవితా భారతి, నటి కోమల్ శర్మ తదితరులు ప్రసంగించారు.

'రెడ్ ఫ్లవర్' బృందానికి విజయ్ సేతుపతి ప్రశంసలు

● సెకండ్ లుక్ రిలీజ్


విజయ్ సేతుపతి, విఘ్నేష్, ఆండ్రూ పాండ్యన్

విఘ్నేష్ - మనీషా జష్నాని నటించిన 'రెడ్ ఫ్లవర్' చిత్ర బృందాన్ని ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి ప్రశంసించారు. ఈ సినిమా టీజర్ వీక్షించిన ఆయన ఎంతో ఇంప్రెస్ అయ్యారు. సినిమా చాలా రిచ్‌గా, గ్రాండ్‌గా రూపొందించారని, టెక్నికల్‌గా చాలా బాగుందంటూ కితాబిచ్చారు. ముఖ్యంగా సంగీతం అద్భుతంగా ఉందని, విజువల్‌గా, టెక్నికల్‌గా సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ క్రియేట్ చేయడంలో చిత్రబృందం కమిట్‌మెంట్‌ను విజయ్ సేతుపతి ఈ సందర్భంగా కొనియాడారు. తనను కలిసిన హీరో విగ్నేష్, దర్శకుడు ఆండ్రూ పాండ్యన్‌లను ప్రత్యేకంగా అభినందించడమేకాకుండా, ఈ సినిమా సెకండ్ లుక్ కూడా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక హీరోలు విజయ్ సేతుపతికి ధన్యవాదాలు తెలిపారు. శ్రీ కాళికాంబాల్ పిక్చర్స్ పతాకంపై కె.మాణిక్యం భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలను సమకూర్చిన ఆండ్రూ పాండ్యన్ దర్శకత్వ బాధ్యతలను కూడా విజయవంతంగా పూర్తి చేశారు. పైగా సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్ళినప్పటి నుంచి అభిమానుల్లో ఉత్కంఠత నెలకొంది. దీనికితోడు విజయ్ సేతుపతి ప్రశంసలు ఇపుడు సినిమాపై అంచనాలను మరింతగా పెంచేశాయి. కాగా, సినిమా మోషన్ పోస్టర్‌ను త్వరలోనే విడుదల చేసేందుకు దర్శకనిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

ఆ యూట్యూబ్ చానెళ్ళను నియంత్రించాలి

● మంత్రి ఉదయనిధికి రాధిక వినతి



అనేక మంది సినీ సెలెబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అసత్య కథనాలు వండివార్చుతున్న యూట్యూబ్ చానెళ్ళ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి, సినీ నటుడు ఉదయనిధికి సీనియర్ నటి, నిర్మాత రాధిక కోరారు. ఈ విషయంలో సెలెబ్రిటీలు కూడా చొరవ తీసుకుని తమ పరువు బజారుకీడ్చుతున్న యూట్యూబ్ చానెల్స్ యజమానులపై పరువు నష్టం దావా వేయాలని ఆమె సూచించారు. ఈ విషయంలో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తెలుగులో సుమారుగా 18 యూట్యూబ్ చానెళ్లపై చర్యలు తీసుకున్నారని ఆమె గుర్తు చేశారు. ఇదే విషయాన్ని ఆమె ప్రస్తావిస్తూ, 'నడిగర్ సంఘం కూడా మేల్కోవాలి. జర్నలిస్టులుగా చెప్పుకునే కొందరు వ్యక్తులు చాలా మంది సెలెబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అదేపనిగా అసత్య కథనాలను ప్రసారం చేస్తున్నారు. ఇలాంటి వారిపై రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి ఉదయనిధితో పాటు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో సినీ పరిశ్రమ కూడా ఏకంకావాలి' అని ఆమె కోరారు.

ఆస్పత్రిలో చేరిన కమల్ సోదరుడు


తండ్రి చారుహాసన్‌తో సుహాసిని

విశ్వనటుడు కమల్ హాసన్ సోదరుడు, సీనియర్ సినీ నటుడు చారుహాసన్ అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చేరారు. 93 యేళ్ళ చారుహాసన్ ఆస్పత్రిలో చేరిన విషయాన్ని ఆయన కుమార్తె, సినీ నటి సుహాసిని తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి బెడ్‌పై ఉన్న తన తండ్రిని హత్తుకున్న ఫొటోను కూడా ఆమె షేర్ చేశారు. 'వైద్యులు, నర్సులు, ప్రజల ప్రేమాభిమానాలు, సంరక్షణతో ఆయన కోలుకుంటున్నారు' అని కామెంట్స్ చేశారు. అయితే, ఆయన అనారోగ్యానికి సంబంధించిన విషయాలు మాత్రం ఆమె వెల్లడించలేదు.కాగా, తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ సహా అనేక భాషా చిత్రాల్లో నటించిన చారుహాసన్.. చివరగా, విజయ్‌శ్రీ జీ దర్శకత్వంలో వచ్చిన 'హరా' మూవీలో నటించారు.

కాలకూట విషం... కోట్లలో ఆదాయం

● పాములను పట్టి.. గరళం సేకరించడం ద్వారా సొసైటీ సంపాదన





కుండల్లో పాములు

పాము అనగానే ఎవరికైనా ముచ్చెమటలు పోస్తాయి. కారణం పాము కాటేస్తే విష ప్రభావంతో ప్రాణాలు పోతాయని, కానీ ఆ విషమే కోట్లు కుమ్మరిస్తుందంటే నమ్మగలరా?.. నమ్మశక్యంగా లేకపోయినా చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో వున్న 'ఇరులర్ స్నేక్ క్యాచర్స్ ఇండస్ట్రియల్ కో-ఆపరేటివ్ సొసైటీ' అర్జిస్తున్న లాభాలను చూస్తే నమ్మక తప్పదు మరి! గత మూడేళ్లలో ఈ సొసైటీ రూ.2.36 కోట్లు విషం ద్వారా ఆర్జించింది..

\- ఆంధ్రజ్యోతి, చెన్నై

ఈస్ట్‌కోస్ట్ రోడ్డులోని ఉత్తర నెమ్మేలిలో 46 ఏళ్ల క్రితం మొసళ్లఫారంలో ప్రఖ్యాత హెర్పెటాలజిస్ట్ రొములస్ విటేకర్ అనే వ్యక్తి నేతృత్వంలో ఏర్పాటైందీ సొసైటీ. చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూర్, చెన్నై జిల్లాలకు చెందిన 350 మంది ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వారితో ఏర్పాటు చేసిన ఈ సొసైటీ ఇంతింతై వటుడింతై అన్నట్లుగా అభివృద్ధి చెందింది. ఇందులో 150 మంది మహిళలు కూడా ఉండడం విశేషం.



పాములు పడుతున్న సొసైటీ సభ్యులు

ఈ సొసైటీలోని సభ్యులు వివిధ ప్రాంతాల్లో వున్న పాములను పట్టుకొచ్చి విషాన్ని సేకరిస్తారు. ముంబై, పుణె, హైదరాబాద్‌లోని ఔషధ పరిశోధనా సంస్థలకు పాము విషాన్ని విక్రయించడం ద్వారా ఈ సొసైటీకి ఆదాయం వస్తోంది. ఈ విషం పాము కాటు, కుక్క కాటు వంటి వాటికి విరుగుడుగానే కాకుండా క్యాన్సర్ వంటి వివిధ వ్యాధులకు ఔషధంగా వినియోగిస్తారన్న విషయం తెలిసిందే. ఈ సొసైటీ సభ్యుడైన కన్నిమార్ స్వామి మాట్లాడుతూ... తమ ఇలవేల్పు నాగదేవతను పూజించిన తరువాత పనుల్లోకి దిగాలన్నది తమ నిబంధన అని, ఆమెను పూజించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ పని ప్రారంభించమన్నారు. తమ వద్ద ఎప్పుడూ చిన్న సంచిలో ఔషధాలతో కూడిన పొడి వుంటుందని, ఎక్కడైనా తమను పాము కాటేస్తే వెంటనే ఆ పొడిని నోట్లో వేసుకుంటామని, ఆ తరువాత దగ్గర్లో వున్న ఆస్పత్రికి వెళ్లి, అక్కడ చికిత్స పొందుతామని మరో సభ్యుడు వివరించారు.

'పాములు పట్టడమనేది ఒక కళ. పాములపై సంపూర్ణ అవగాహన ఉంటేనే వాటి జోలికి వెళ్లాలి. అది ఏ రకం జాతి, దాని వేగం, ఎదురుదాడి విధానం ఎలా ఉంటుంది? అనే విషయాలు తెలిస్తేనే పాము దరిదాపులకు వెళ్లాలి. లేకపోతే పాములకు దూరంగా ఉండడం మంచిది' అని మరో సభ్యుడు తెలిపారు. సభ్యులు పట్టుకొచ్చే పాముల్ని కుండల్లో పెడతారు. వాటి నుంచి తీసిన విషాన్ని లేబొరేటరీలో వివిధ ప్రక్రియల ద్వారా పొడి చేసి విక్రయిస్తారు. ఏటా సగటున 500 నుంచి 550 గ్రాముల విషం తీయబడుతుంది. గత మూడేళ్లలో 1,800 గ్రాముల విషం సేకరించి రూ.5.43 కోట్లు సేకరించినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. తద్వారా ఎప్పుడూ లేనివిధంగా రూ.2.36 కోట్ల మేర లాభాలు ఆర్జించినట్లు వివరించారు. కుండల్లో పెట్టే పాములకు ఆహారంగా వేసేందుకు ఎలుకల్ని పెంచుతామన్నారు.

ఏటా 9 వేల పాముల్ని పట్టుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. పొలాలు, పొదలు, గుట్టలు, సరస్సులు వంటి వాటిల్లో పాముల్ని పట్టుకోవచ్చు. కానీ అడవుల నుంచి మాత్రం పాముల్ని పట్టుకోవడానికి ప్రభుత్వం అనుమతించదు. పట్టుకున్న పాములను 28 రోజుల తరువాత అటవీశాఖాధికారుల సమక్షంలో అడవుల్లో విడిచిపెడతామని సొసైటీ సభ్యులు తెలిపారు.


పాములు పట్టే ముందు పూజలు చేస్తున్న సభ్యురాలు


పాము నుంచి విషం సేకరిస్తున్న దృశ్యం


పాముపిల్లలు


పాముల నుంచి సేకరించిన విషం

ప్రశాంత్ హాస్పిటల్‌లో 'హ్యూమన్ మిల్క్ బ్యాంక్'



చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలోని ప్రశాంత్ హాస్పిటల్‌లో 'హ్యూమన్ మిల్క్ బ్యాంక్' ఏర్పాటైంది. దీనిని బుధవారం ఆసుపత్రి ఛైర్‌పర్సన్ డాక్టర్ గీతా హరిప్రియ, మద్రాస్ మెడికల్ కాలేజీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రెమా చంద్రమోహన్, సవీతా మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ జె.కుముద తదితరులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతా హరిప్రియ మాట్లాడుతూ.. ప్రశాంత్ హ్యూమన్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు సమగ్ర ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను అందించే మా మిషన్‌లో ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. నెలలు నిండని శిశువులకు ఈ బ్యాంక్ ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.

యూఎన్ గ్లోబల్ కాంపాక్ట్ నెట్‌వర్క్‌తో రెఫెక్స్ భాగస్వామ్యం


ఒప్పంద కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): యూఎన్ గ్లోబల్ కాంపాక్ట్ నెట్‌వర్క్ ఇండియాతో న్యూయార్క్‌కు చెందిన రెఫెక్స్ గ్రూప్ ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం చెన్నైలో జరిగిన ఈ కార్యక్రమంలో యూఎన్ గ్లోబల్ కాంపాక్ట్ నెట్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్, రిఫెక్స్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ జైన్, నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ ఛైర్‌పర్సన్ సి.అచలేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ఒప్పందం కుదుర్చుకోవడం పట్ల రత్నేష్ సంతోషం వ్యక్తం చేశారు.

మేట్టూరు డ్యాం నుంచి నీరు విడుదల


నీటిని విడుదల చేస్తున్న కలెక్టర్ బృందాదేవి

ప్యారీస్, జూలై 31: సేలం జిల్లా మేట్టూరు డ్యాం నుంచి బుధవారం ఉదయం 1.28 లక్షల ఘనపుటడుగుల నీటిని కావేరి నది కాలువలో విడుదల చేస్తున్నారు. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా అక్కడున్న డ్యాంలు పూర్తిస్థాయిలో నిండిపోవడంతో మిగులు జలాలను కావేరి నదిలోకి వదులుతున్నారు. దీంతో మంగళవారం సాయంత్రం 6 గంటలకు మేట్టూరు డ్యాం పూర్తిసామర్థ్యం 120 అడుగులకు పెరిగింది. డ్యాం భద్రత దృష్ట్యా అదనంగా చేరుతున్న జలాలను అలాగే దిగువకు విడుదల చేస్తున్నారు. రాత్రి 8 గంటలకు 66,000 ఘనపుటడుగుల నీరు విడుదల చేసిన నేపథ్యంలో, బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం వరకు 1.28 లక్షల ఘనపుటడుగుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, సేలం, ఈరోడ్, నామక్కల్ జిల్లాల్లో ఉన్న సుమారు 45,000 ఎకరాలకు సాగునీరు చేరేలా జిల్లా కలెక్టర్ బృందాదేవి నీటిని విడుదల చేశారు. కావేరి నది కాలువ తీరంలో నివసిస్తున్న ప్రజలు వరద ప్రవాహంలో చిక్కుకోకుండా అప్రమత్తంగా ఉండాలంటూ జిల్లా యంత్రాంగం లౌడ్ స్పీకర్ల ద్వారా హెచ్చరించింది. కావేరి పరీవాహక ప్రాంతంలోని జిల్లాలకు వరద హెచ్చరికలు జారీ అయ్యాయి.


ఇటీవల చెన్నైలో జరిగిన అఖిల భారత వేద, శాస్త్ర అధ్యయన విద్యార్థుల 16వ సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు


చెన్నై కొళత్తూర్‌లో సీఎండీఏ ఆధ్వర్యంలో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న డయాలసిస్, కో-వర్కింగ్ స్పేస్ భవనాన్ని బుధవారం పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రి పీకే శేఖర్‌బాబు తదితరులు

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం


లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

ప్యారీస్, జూలై 31: లయన్స్ క్లబ్ ఆఫ్ మద్రాస్ సౌత్ సిటీ డిస్ట్రిక్ట్-324 ఎం-రీజియన్ 3 జోన్-1 నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఎగ్మూర్‌లో జరిగింది. డా.ఏవీ శివకుమారి అధ్యక్షురాలిగా, రుక్మిణి కార్యదర్శిగా, విజయలక్ష్మి కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా లయన్ సీటీ నటేశన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లయన్ శ్రీలక్ష్మి మోహన్‌రావు, మీనాక్షి సుందరం, జె.సురేష్‌కుమార్, ఎస్.విఘ్నేశ్వరన్, జయంతి తదితరులు పాల్గొని, నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.


చెన్నై క్యాంప్ కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకొని ఈ నెల 7వ తేదీన జరుగనున్న 'కలైంజర్ 100 కవితలు 100' అనే పుస్తకావిష్కరణకు సీఎంను ఆహ్వానిస్తున్న సినీ గేయరచయిత వైరముత్తు


చెన్నై కొళత్తూర్ ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ (చిత్రంలో) మంత్రులు పొన్ముడి, పీకే శేఖర్‌బాబు, జీసీసీ మేయర్ ప్రియ, ఎంపీ కళానిధి వీరాస్వామి, ఎమ్మెల్యే తాయగం రవి తదితరులు